దేశానికి టీచింగ్ పాయింట్ తెలంగాణ

- రాహుల్‌కు కేటీఆర్ కౌంటర్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): సాగునీటి రంగంలో తెలంగాణ సాధించిన స్వర్ణయుగాన్ని వంద జన్మలెత్తినా సాధించలేరని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చురక అంటించారు. దేశానికి తెలంగాణ టీచింగ్ పాయింట్ అన్న కేటీఆర్.. రాహుల్ చేసిన ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం సాక్షిగా కాంగ్రెస్ చేసిన తప్పులకు, తెలంగాణ ప్రజలకు పెట్టిన తిప్పలకు కాళేశ్వరం జలాలను నెత్తిపై జల్లుకొని పాప ప్రక్షాళన చేసుకోండని ట్విట్టర్‌లో ధ్వజమెత్తారు.

వాస్తవాలు మాట్లాడు:ఎర్రబెల్లి

పెద్దవంగర, అక్టోబర్ 19: రాహుల్ గాంధీ ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదివి మాట్లాడే కంటే.. అభివృద్ధిని చూసి వాస్తవాలు మాట్లాడాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హితవు పలికారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్వహించిన పలు ప్రచార సభల్లో మంత్రి మాట్లాడుతూ.. 'మీ పాలనలో కాళేశ్వరం లాంటి ప్రాజెక్ట్ ఎక్కడైనా కట్టారా? రూ.లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతది? స్క్రిప్టును చదివి మాట్లాడటం కాదు.. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని కండ్లారా చూసి మాట్లాడితే నీకు గౌరవం ఉంటది' అని చెప్పారు. అలాగే.. 'రేవంత్‌రెడ్డి ఓ 420.. నన్ను దద్దమ్మ అంటావా? నీ లాగా నాకు బ్రోకర్ మాటలు రావు కాబట్టి నేను దద్దమ్మనే. అందుకే నన్ను ప్రజలు 7 సార్లు గెలిపించారు. నువ్వు ఒకసారి పోటీ చేసిన కాడ మళ్లీ చేయవు. ఓడిపోతున్నావు. నీవు వచ్చి నంకనే కాంగ్రెస్ నాశనం అయిందని మీ పార్టీ వాళ్లే అంటున్నారు' అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విరుచుకుపడ్డారు.

రాహుల్ లీడర్ కాదు.. రీడర్

- రేవంత్ రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారు
- గ్యారెంటీలపై ఏ హోదాలో హామీ ఇస్తున్నారు?
- కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ తెచ్చుకున్నాం
- సంక్షేమ పాలనకు కేరాఫ్ సీఎం కేసీఆర్ సర్కార్
- రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ లీడర్ కాదు.. జస్ట్ రీడర్ అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బ్యాచ్ రాసిచ్చిన స్క్రిప్ట్‌నే ఆయన చదువుతున్నారని మండిపడ్డారు. ఎన్నికలు అనగానే ఢిల్లీ నుంచి కాంగ్రెస్ నేతలు వచ్చి వాలుతున్నారని, వాళ్లు తెలంగాణకు బంధువులు కాదు.. ప్రజలను పీడించే రాబంధులని విమర్శించారు. తెలంగాణలో గెలిస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని రాహుల్‌గాంధీ ఏ హోదాలో హామీ ఇస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేనా? రాహులా? ప్రియాంకనా? అని ప్రశ్నించారు. తెలంగాణలో ఏ నియోజకవర్గానికి వెళ్లినా అభివృద్ధి కండ్లకు కడుతున్నదని, ఏ గుండె చప్పుడు విన్నా జై కేసీఆర్, జై తెలంగాణ అంటున్నదని పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఆంక్షలెందుకు?

ఛత్తీస్‌గఢ్‌లో ధాన్యాన్ని మద్దతు ధరకు కొంటున్నామని రాహుల్‌గాంధీ అబద్ధాలు చెప్తున్నారని, అక్కడ ఎకరాకు 15 క్వింటాళ్లు మాత్రమే కొంటున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లో మాదిరిగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా కల్లాల దగ్గరే పంట మొత్తం కొంటున్నారని వివరించారు. రైతు రుణమాఫీ చేయలేదంటున్న రాహుల్‌గాంధీ దీనిపై ఒక్కసారి రైతులను అడగాలని సూచించారు.

బ్రిటీషోళ్లు గొప్పోళ్లా?

తెలంగాణ ఇచ్చామని చెప్పుకునే అర్హత కాంగ్రెస్‌కు లేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. 2004లో తెలంగాణ ఇస్తామని టీఆర్ఎస్‌తో పొత్తు పొత్తుపెట్టుకున్న కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే మాట తప్పిందని విమర్శించారు. దానిని కప్పిపుచ్చుకునేందుకు టీఆర్ఎస్‌ను బలహీనపరిచి తెలంగాణ వాదమే లేదని బుకాయించేందుకు కుట్రలు చేయలేదా? అని ప్రశ్నించారు. 'కేసీఆర్ కేంద్రం నుంచి ఎందుకు వైదొలిగారు? కరీంనగర్ ఉప ఎన్నికలో ప్రజలు తెలంగాణ సెంటిమెంట్‌ను కాంగ్రెస్‌కు రుచిచూపించలేదా?' అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్‌తోసహా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని చాటారని చెప్పారు. తెలంగాణ కోసం కేసీఆర్ ప్రాణాలు పణంగా పెట్టి ఆమరణ నిరాహారదీక్ష చేస్తే కాంగ్రెస్‌కు మరో మార్గం లేక తెలంగాణ ప్రకటన చేసిందని వివరించారు. రాహుల్ తీరు చూస్తుంటే స్వాతంత్ర్యం కోసం ఉద్యమాలు చేసినోళ్లదేమీ లేదు కానీ ఇచ్చిన బ్రిటీషోళ్లు గొప్పోళ్లు అన్నట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు.

దునియా మొత్తం కీర్తిస్తున్నది

బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలూ తెలంగాణ ద్రోహులేనని హరీశ్‌రావు మండిపడ్డారు. హుజూరాబాద్‌లో బీజేపీకి కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందా? లేదా? అని ప్రశ్నించారు. 'బీఆర్ఎస్ ఎవరికీ బీ టీం కాదు. తెలంగాణ ప్రజలకు ఏ టీం. మాకు తెలంగాణ ప్రజలే హైకమాండ్. మా ఎజెండా తెలంగాణ అభివృద్ధి. మా విధానం సంక్షేమం. దేశంలో సంక్షేమ పాలనకు కేరాఫ్ అంటే తెలంగాణలో కేసీఆర్ సర్కార్ అని దునియా మొత్తం కీర్తిస్తున్నది' అని పేర్కొన్నారు.

సమక్క-సారక్క అప్పుడు గుర్తురాలేదా?

అధికారంలో ఉన్నప్పుడు సమ్మక్క-సారక్క జాతరను పట్టించుకోని కాంగ్రెస్ ఇప్పుడు జాతీయ ఉత్సవంగా ప్రకటిస్తామని చెప్పడం విడ్డూరమని హరీశ్‌రావు మండిపడ్డారు. రాహుల్, ప్రియాంక రామప్పకు వెళ్లి దేవుడిని దర్శించుకోవడం మంచిదేనని, అంత గొప్ప గుడికి ఏం చేశామన్న పాపభీతి వారిలో కలిగిందా? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ తెలంగాణను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దారని వివరించారు. కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో ఇలాంటి సేవలు ఉన్నాయా? అని ప్రశ్నించారు.

గురువారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ద్రోహం చేసిందే కాంగ్రెస్

- ఆ పార్టీ కారణంగానే బలిదానాలు
- లక్ష కోట్ల వ్యయం లేని ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎలా సాధ్యం?
- కమీషన్లు తీసుకుంటే చెరువులు నిండేవా? సాగు నీళ్లు అందేవా?
- రాహుల్‌పై ఎమ్మెల్సీ కవిత ఫైర్

నందిపేట, అక్టోబర్ 19: 'తెలంగాణకు తీరని ద్రోహం చేసిందే కాంగ్రెస్. ఆ పార్టీ వల్లే తెలంగాణ చాలా నష్టపోయింది. సకల జనులంతా కలిసి సాధించుకున్న ప్రజా తెలంగాణపై మాట్లాడే అర్హత ఆ పార్టీకి లేదు' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదివే రాహుల్ గాంధీని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, కుటుంబపాలనపై ప్రియాంకాగాంధీ మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. గురువారం ఆమె నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ రాహుల్‌గాంధీ ఆరోపించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ వ్యయం కలిపితే రూ.లక్ష కోట్ల లోపే ఉన్నదని, అలాంటప్పుడు లక్షల కోట్ల అవినీతి ఎలా చేస్తారని ప్రశ్నించారు. అవినీతి జరిగి ఉంటే, కమీషన్లు తీసుకుని ఉంటే చెరువులకు, రైతుల పొలాలకు సాగునీరు, ఇంటింటికీ తాగునీరు వచ్చేది కాదని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి జరిగింది కాబట్టి ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తి కావడానికి 60 ఏండ్లు పట్టిందని దుయ్యబట్టారు. తాము పారదర్శకంగా కష్టపడి పని చేశాం కాబట్టే పొలాల్లో నీళ్లు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ హక్కులపై రాహుల్‌గాంధీ ఏనాడూ పార్లమెంట్‌లో మాట్లాడలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌వి దొంగ వాగ్దానాలు, అబద్ధపు వాగ్దానాలు, ఆపద మొక్కుల వాగ్దానాలని విమర్శించారు.

కాంగ్రెస్ వస్తే ధరణి గుల్ల

ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపితే భూమికి హక్కుదారులెవరో ఎలా తెలియాలని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ పొరపాటున అధికారంలోకి వస్తే ధరణి మాత్రం గ్యారంటీగా గుల్ల అవుతుందని చెప్పారు. ఈ ఎన్నికలు తెలంగాణ ద్రోహులకు, తెలంగాణ ప్రేమికులకు మధ్య జరుగుతున్నవని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి పక్కా తెలంగాణ వ్యతిరేకి, తెలంగాణ ద్రోహి అని మండిపడ్డారు. కాంగ్రెస్‌పై తిరగబడేందుకు ప్రజలు సిద్ధమయ్యారని చెప్పారు. 2004లో తెలంగాణ ఇస్తామని చెప్పి పదేండ్ల పాటు నెరవేర్చకుండా వందలాది యువకుల బలిదానాలకు కాంగ్రెసే కారణమైందని విమర్శించారు. అప్పుడే రాష్ట్రం ఇచ్చి ఉంటే తెలంగాణ మరింతో అభివృద్ధి అయ్యేదని చెప్పారు. 'మీరు ఆర్మూర్ వస్తారట. సంతోషం. గుత్ప ఎత్తిపోతల పథకాన్ని రూ.25 కోట్లతో మరమ్మతు చేసుకున్నాం. ఫత్తేపూర్ సుప్రియాల లిఫ్ట్, మాక్లూర్ లిఫ్ట్.. ఇలాంటివాటికి రూ.350 కోట్లు ఖర్చు చేశాం. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్ని చెరువులు నిండుకుండలా ఉన్నాయి. వాటిని ఒకసారి చూసిపోండి' అని రాహుల్‌కు కవిత సూచించారు.

ఆయన ఏ యాత్ర చేసినా కొసెల్లలేదు

- బస్సుయాత్ర తుస్సుమంటది
- కుటుంబ పాలన వ్యాఖ్యలు విడ్డూరం
- వారసత్వమే రాహుల్‌గాంధీకి ఉన్న ఏకైక అర్హత
- విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 19: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలో ఏ యాత్ర చేపట్టినా.. అది మధ్యలోనే ఆగింది తప్ప కొసెల్లలేదని, ఇప్పుడు తెలంగాణలో ఎన్నికల వేళ చేస్తున్న బస్సుయాత్ర కూడా తుస్సుమంటదని విద్యుత్తుశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గేను మూలకు పడేసిన రాహుల్ గాంధీ.. కుటుంబ పాలన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఫైర్ అయ్యారు. రాహుల్‌కు నాయకత్వ అర్హతలు లేవని, ఆయనకున్న ఏకైక అర్హత వారసత్వమేనని ఎద్దేవా చేశారు. కుంభకోణాలకు, అవినీతికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అని, ఈ విషయం ప్రజలందరికీ తెలుసని చెప్పారు. రాహుల్ గాంధీ మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటున్నదని పేర్కొన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ ఖర్చు లక్ష కోట్ల లోపే ఉందని, అలాంటిది లక్ష కోట్ల అవినీతి జరిగిందని రాహుల్ ఎలా అంటారని ప్రశ్నించారు. ఇంత అవినీతి జరిగితే కాంగ్రెస్ ఎందుకు ఫిర్యాదు చేయలేదని నిలదీశారు. సీఎం కేసీఆర్ వల్లే తెలంగాణ సస్యశ్యామలమైందని కొనియాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఉన్నత విద్యా మండలి మాజీ సభ్యుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్. చిత్రంలో చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

రాహుల్ చెప్పినవన్నీ అబద్ధాలే

- కేసీఆర్‌తోనే 'ములుగు' సుభిక్షం
- మీడియాతో మంత్రి సత్యవతిరాథోడ్
- రాహుల్, ప్రియాంకలు టూరిస్టులు
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ జాతీయ నేతలు ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల్లో చేపట్టిన బస్సు యాత్ర పెద్ద ఫ్లాప్ షో అని, ఆ సందర్భంగా రాహుల్ చెప్పిన మాటలన్నీ పచ్చి అబద్ధాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లపై కాంగ్రెస్ జాతీయ నేతలు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గురువారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోతు కవిత, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంత్రి సత్యవతి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అవగాహనలేమితో రాసిచ్చిన స్క్రిప్టును రాహుల్‌గాంధీ చదివారని దుయ్యబట్టారు. విభజన చట్టంలోని గిరిజన యూనివర్సిటీ గురించి రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ఏనాడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలకు రామప్ప దేవాలయం, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర, గిరిజన యూనివర్సిటీ అంశాలు అసెంబ్లీ ఎన్నికల ముందర గుర్తుకు రావడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ములుగు, భూపాలపల్లి కుగ్రామాలుగా ఉండేవని, కేసీఆర్ పాలనలో జిల్లా కేంద్రాలుగా మారి ఎంతో అభివృద్ధి సాధించాయని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ జాతీయ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు పొలిటికల్ టూరిస్టులని, రామప్ప ఆలయాన్ని చూసేందుకు వచ్చి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని ఉద్యమ నేతగా, సీఎంగా కేసీఆర్ ఎన్నిసార్లు కోరినా కాంగ్రెస్ పట్టించుకోలేదని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ కృషితోనే రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు వచ్చిందని స్పష్టం చేశారు. ములుగును జిల్లాగా మార్చి మెడికల్ కాలేజీ, వంద పడకల దవాఖాన ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు.

కర్ణాటకలో కోతలు.. ఇక్కడ కూతలు

- అక్కడ కాంగ్రెస్ ఎన్నికై 6 నెలలైనా అమలుకాని గ్యారెంటీలు
- ఇక్కడ అమలు చేస్తామని ప్రగల్భాలు
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం
- దమ్ముంటే దేశమంతా ఉచిత విద్యుత్తుప్రకటించాలని సవాల్

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్19 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో ఎన్నికల ముందు ప్రకటించిన గ్యారెంటీలను అమలు చేయలేక చేతులెత్తేసిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అమలు చేస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నదని బీఆర్ఎస్ నేత, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనపై, సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. లక్ష కోట్లే ఖర్చు కాని కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని సాక్షాత్తు కాగ్ నివేదిక చెప్పిందని, అసలు ఆ ప్రాజెక్టే అవసరం లేదని ఎన్జీటీ చెప్పిందని, ఇలాంటి ప్రాజెక్టులో అవినీతి జరిగిందని రాహుల్ ఎలా అంటారని ప్రశ్నించారు. ఇంత అవినీతి జరిగితే కాంగ్రెస్ ఎందుకు ఫిర్యాదు చేయలేదని నిలదీశారు. సీఎం కేసీఆర్ వల్లే తెలంగాణ సస్యశ్యామలమైందని కొనియాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఉన్నత విద్యా మండలి మాజీ సభ్యుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా చేయలేమంటూ స్వయంగా ఆ రాష్ట్ర మంత్రి చేతులెత్తేశారని, హామీ మేరకు బియ్యం ఇవ్వలేక నగదు ఇవ్వాలని చూస్తున్నారని తెలిపారు. అక్కడ అమలుగాని గ్యారెంటీలు ఇక్కడ అమలవుతాయా అని ప్రశ్నించారు. రాహుల్ తెలంగాణ రైతుల పక్షాన ఏనాడూ మాట్లాడలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే దేశమంతా ఉచిత కరెంటు ఇస్తామని ప్రకటించాలని సవాల్ విసిరారు. ఏ గ్యారెంటీల్లో లేకున్నా పీసీసీ అధ్యక్షుడు తులం బంగారం ఇస్తామంటూ వాగ్దానం చేస్తున్నారని, అది నోరా ఇంకేమైనా అని విమర్శించారు. కాంగ్రెస్ పాపాలను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరచిపోదని తెలిపారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీతో కుమ్మక్కయిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని నిస్సిగ్గుగా దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. రాహుల్ రాష్ట్రానికి ఎన్నిసార్లు వచ్చినా, పొర్లుదండాలు పెట్టినా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది లేదని, బీఆర్ఎస్ గెలుపు తథ్యమని మంత్రి స్పష్టం చేశారు.

కారు కోసం ముక్తకంఠం

సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డిలకు అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

సీఎం కేసీఆర్ వెంటే విశ్రాంత ఉద్యోగులు

గజ్వేల్ అర్బన్, అక్టోబర్19: గజ్వేల్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ వెంటే ఉంటామని విశ్రాంత ఉద్యోగులు ప్రకటించారు. సీఎం కేసీఆర్‌ను మళ్లీ భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆ ప్రతిని గురువారం గజ్వేల్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు అందజేశారు. సీఎం కేసీఆర్ హయాంలో గజ్వేల్ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధించిందని, ఎన్నో సౌకర్యాలు కలిగాయని వారు పేర్కొన్నారు.

స్పీకర్‌కు కుల సంఘాల మద్దతు

బాన్సువాడ, అక్టోబర్ 19: బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా కుల సంఘాల ఏకగ్రీవ తీర్మానాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం దేశాయిపేట్‌కు చెందిన బోయ సంఘం (120 సభ్యులు), ముదిరాజ్ సంఘం (50 మంది) సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు తీర్మాన ప్రతిని గురువారం బాన్సువాడలో స్పీకర్‌ను కలిసి అందజేశారు.

వేములకు జైకొట్టిన మేరు సంఘం

మోర్తాడ్, అక్టోబర్19: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మోర్తాడ్ మండలంలో మద్దతు వెల్లువెత్తుతున్నది. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న మేరు సంఘం సభ్యులు (62 కుటుంబాలు) వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ మేరకు తీర్మాన కాపీలను ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, సర్పంచ్ ధరణికి అందజేశారు.

స్పీకర్‌పై అభిమానంతో ఇంటికి ఫ్లెక్సీ

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 19: నిత్యం ప్రజల కష్టసుఖాల్లో ఉండే స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి ఎన్నికల వేళ జనం నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తున్నది. పోచారంపై ఉన్న అభిమానాన్ని ఓ కుటుంబం వినూత్నంగా చాటుకున్నది. ఎన్నికల్లో సభాపతికే ఓటు వేస్తామని బాన్సువాడ పట్టణ పరిధిలోని కొయ్యగొట్టకు చెందిన పండరిగౌడ్ కుటుంబ సభ్యులు తమ ఇంటిగోడపై ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇతర పార్టీల వారు ఓటు అడగడానికి తమ ఇంటికి రావొద్దని స్పష్టం చేశారు.

స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా బాన్సువాడ పట్టణం కొయ్యగొట్టలో తమ ఇంటికి ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన పండరి కుటుంబం

కాంగ్రెస్‌కు రెండో లిస్టు భయం?

- తొలి జాబితా అనంతరం గొడవలతో పార్టీలో బుగులు!
- రెండో జాబితా వస్తే పరిస్థితి చేతుల్లో ఉండదని ఆందోళన
- రెండో లిస్టు విడుదల ఆలస్యంపై ఆశావహుల అసంతృప్తి
- ఇచ్చిన మాట ప్రకారం లిస్టు విడుదల చేయని కాంగ్రెస్
- ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తుందంటూ విమర్శలు

తొలి జాబితాకే గాంధీభవన్‌కు తాళం

తొలి జాబితా ప్రకటించాక అసంతృప్త నేతలు గాంధీభవన్‌కు తాళంవేసి నిరసన తెలిపారు. 55 మందితో ప్రకటించిన చిన్న జాబితాకే కాంగ్రెస్‌లో అసంతృప్తి అగ్గి రాజుకున్నది. ఎలాంటి ఇబ్బంది లేని సీనియర్ల స్థానాలు, హైదరాబాద్ వంటి స్థానాలతో పేర్లను ప్రకటిస్తేనే ఇంత రచ్చ జరిగితే ఇక మిగిలిన స్థానాల్లో జాబితా ప్రకటిస్తే పరిస్థితి ఏమిటన్న భయం కాంగ్రెస్ పెద్దలకు పట్టుకున్నట్టు తెలిసింది. ఇంకా 64 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉన్నది. ఈ జాబితాను విడుదల చేస్తే పార్టీలో అగ్గి రాజుకోవటం ఖాయమని ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్టు సమాచారం.

హైదరాబాద్, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): అభ్యర్థుల రెండో జాబితా విడుదలకు కాంగ్రెస్ భయపడుతున్నదా? జాబితా విడుదల అనంతరం జరగబోయే అసంతృప్తుల అల్లర్లపై ఆందోళన చెందుతున్నదా? అంటే అవుననే గుసగుసలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల్లో జాబితాను ప్రకటిస్తామని చెప్పి, వారం గడుస్తున్నా ప్రకటించకపోవటమే ఇందుకు ప్రధాన కారణం. ఈ నెల 15న కాంగ్రెస్ అధిష్ఠానం 55 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. రెండు రోజుల్లో మిగిలిన అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపింది. అయితే, వారం గడుస్తున్నా రెండో జాబితా విడుదల కాలేదు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జాబితా విడుదలకు జంకుతున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తొలి జాబితా తర్వాత కాంగ్రెస్ పార్టీలో అసంతృప్త జ్వాలలు చెలరేగాయి. ఇక రెండో జాబితా విడుదల చేస్తే ఇది మరింత పెరిగే అవకాశం ఉన్నదని, అందుకే వెనకంజ వేస్తున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అల్లర్లు జరిగితే ప్రజల్లో పార్టీ చులకనవుతుందేమోనన్న ఆందోళన పార్టీ పెద్దల్లో వ్యక్తం అవుతున్నట్టు తెలిసింది. రెండో లిస్టు విడుదల చేస్తే నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పార్టీని వీడే అవకాశం ఉన్నదని భావిస్తున్నట్టు సమాచారం. అందుకే రెండో జాబితా విడుదలను అలస్యం చేస్తున్నదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రాహుల్, ప్రియాంక రాష్ట్రంలో పర్యటిస్తున్న నేపథ్యంలో రెండో లిస్టు విడుదల చేస్తే, వారికి అసంతృప్తుల సెగ తగిలే అవకాశం ఉన్నదని ఆలోచించినట్టు తెలిసింది. వాళ్ల పర్యటన పూర్తయ్యాక తీరిగ్గా జాబితా ప్రకటిద్దామని నిర్ణయించినట్టు సమాచారం.

ఇక హామీలు అమలు చేస్తారా?

జాబితా ఆలస్యంపై కాంగ్రెస్‌ను ఉద్దేశించి తెలంగాణ సమాజం సెటైర్లు పేల్చుతున్నది. ఇచ్చిన మాట ప్రకారమే రెండో జాబితా విడుదల చేయని కాంగ్రెస్.. హామీలను ఎలా నెరవేరుస్తుందని ప్రశ్నిస్తున్నది. అభ్యర్థుల అసంతృప్తినే నిలువరించలేని హస్తం పార్టీ పెద్దలు.. తెలంగాణ ప్రజల్ని పాలించేందుకు ఎలా అర్హులు అవుతారని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ జాబితాను విడుదల చేసేందుకే జంకుతుంటే, కేసీఆర్ మాత్రం ఇచ